# చంక్రమణం

ఉమాపతి పద్మనాభశర్మ



ప్రేమానురాగాలు వాయనాలు. నిరంతరమూ చేతులు మారుతుంటవి. ఈ ఇచ్చిపుచ్చుకోవడాలకు ఒక మితి అంటూ ఉండాలని శాసిస్తుంది సమాజ ధర్మం. వ్యక్తి మనసూ దానినే బలపరుస్తుంది. మితలేకపోతే? పరిశీలించ దగిన పరిణామం మాత్రం అవును.

---

అర్థరాత్రి దాటింది.

కలల బరువుతో అలసిపోయిందేమో గాఢంగా నిద్రిస్తున్నది మంజుల. హేమంత సీమంతిని వెన్నెల చీర కట్టుకుని, తెలిమబ్బుల విరిదండ తురుముకుని, చల్లగాలి మేలిముసుగు వేసికొని వయ్యారం ఒలకబోస్తున్నది. కిటికీ పక్కని చెట్ల గుబుర్లలో ఉండీ ఉండీ రెక్కలు విదిలిస్తున్నాయి పక్షులు.

"......శిక్షితం యువతి నైపుణంతయా, యత్తదేవ గురుదక్షిణీకృతం." నిద్రిస్తున్న ఆమె హృదయంలో ఆ శ్లోకం మేలుకొని, ఊపిరి సలపనీయకుండా అనేక భంగిమల్లో నాట్యం చేస్తున్నది.

శివుడు నేర్పిన అనురాగాన్ని తిరిగి ఆయనకే గురుదక్షిణగా సమర్పించుకుందిట పార్వతి. ఎంత ధన్యురాలు! ఎన్ని యుగాలవరకు మధిస్తోయినా ఆ భావానికి హద్దెక్కడ?

# చంక్రమణం

సత్యమూర్తి రోజు రోజుకు ఓ సమస్యగా మారిపోతున్నాడు తనకు. ఎదురుగుండా ముద్ద బంతి పూవులా కూర్చున్న తనకుగాక ఇంత రసవత్తరమైన పాఠాన్ని ఏ గోడకో, ఏ కిటికీకో, ఏ పటానికో చెబుతాడేమిటి? ఏమిటో మరి, తన సౌందర్యంమీద తన కెనలేని నమ్మకముంది. అలా అని అతడు జడుడూ కాదు. తన వాక్ప్రతిభతో ఒళ్ళు మరిపిస్తాడు. సున్నితంగా హాస్యం చేస్తాడు. వ్యంగ్యంగా మాటాడతాడు. అప్పుడే ఓ లిప్త కాలంపాటు చిన్నగా నవ్వి, ఓ అర సెకనుకాలంతన కళ్ళల్లోకి చూస్తాడు. ఆ చూపులోనే ఓ విలువైన జలదరింపూ, మనస్సును పెనవేసుకునే ఓ అనుభూతీ—ఇవీ తనను కలవరపెడతాయి.

కిటికీగుండా ఓ గాలితెర దుందుడుకుగా ప్రవేశించి ఆమె ముంగురులను చెదరగొట్టింది. రగ్గును దగ్గరగా కప్పుకుని అటు తిరిగి పడుకుంది మంజుల.

ఎన్నో ఊహా సామ్రాజ్యాలు లోన దాచుకుని అతి సామాన్యుడుగా బ్రతుకుతున్న సత్యమూర్తిని లోకం అంతస్సుల పెనుభూతద్దంలోంచి చూస్తుంది. పెరిగిన గడ్డం, లోతుకుపోయిన కళ్ళూ, చెదరిపోయిన జుట్టూ—ఇవీ అతనిలో లోకం చూచే అలంకారాలు. సంస్కారం ఉట్టిపడే నిశితమైన చూపూ, గంభీరమైన మాట తీరూ, ఏదో అర్థంకాని వైరాగ్యం—ఇవీ అతనిలో తాను చూచే ఆభరణాలు.

దిక్కూ, మొక్కూ, సిరీ సంపదాలేని అతను!

లక్షాధికారి కూతురు తాను!!

ఏమిటీ ఉత్కంఠ? ఎందుకీ కౌతుకం?? ఎంత ప్రయత్నించినా అతనో ట్యూషన్ మేస్టారుగా పరిపెట్టుకోలేకపోతున్న దేం? తనను ధిక్కరించి తన హృదయం అతనికి విలువ నిస్తుందా? ఏమిటీ సాహసం? ఈ మనసు చలాయించే నిరంకుశత్వానికి తాను బానిస..

కిటికీగుండా ప్రసరిస్తున్న వెన్నెలతో పోటీ పడాలని వృధా ప్రయత్నం చేస్తున్నది బెడ్‌లైటు. తలుపు రెక్క కిర్రుమని చప్పుడైంది.

'మంజులగారూ!' అని పిలుస్తాడు తనను. ఈ నాగరకత వ్యక్తులమధ్య సృష్టించే అగాధంలా, కలిమిలేములమధ్య కట్టిన ఇనుప గోడలా ఆ పిలుపు తనను బాధ పెడుతుంది.

అతనికోసమైనా తానొక బీద కుటుంబంలో పుట్టి ఉంటే? ఏమిటీ పిచ్చి ఆలోచన? తాను తలుచుకుంటే అతన్ని ధనవంతుడుగా చెయ్యలేదూ?

తలుపు రెక్క మళ్ళీ కిర్రుమని చప్పుడైంది. మంజుల గాఢంగా నిద్రపోతున్నది.

ఇక కృష్ణమూర్తి బావకు తానంటే ఎక్కడా లేని మక్కువ. తాను పుట్టగానే బంధువులంతా కలిసి తనమీద ఓ ముద్రవేశారు 'కృష్ణమూర్తి పెళ్ళాం' అని. మేనరికపు హక్కునంతా ఉపయోగించుకుని, 'మంజూ' అని పిలుస్తాడు. తాను చిరునవ్వు నవ్వుతుంది.

గులాబి రంగు ఒళ్ళూ, వంకీల జుట్టూ, నవ్వు ముఖం, యోధుడులా అంగ సౌష్ఠవం—అతనిలో ప్రత్యేకమైన ఆకర్షణలు.

ఒక తనలాటి చదువుకున్న యువతిని వెర్రి యెత్తించే వ్యక్తిత్వం అతనిలో ఉంది.

అందుకే....

* * * *

ఆ సాయంకాలం—

రివ్వున గాలి వీస్తున్నది. సముద్రపు కెరటాలు ఉవ్వెత్తుగా లేచిపడుతున్నాయి. జీవితానికి వ్యాఖ్యానంలా హోరుమని అర్థంలేని శబ్దం. ఇసుకలో ఒంటరిగా కూర్చున్నాడు కృష్ణమూర్తి. ఎడమకున్న పాపిట గాలితాకిడితో కుడికిమారింది. 'కుడి ఎడమైతే' పాట జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాడు. మనసు మంజుల చుట్టూ పరిభ్రమిస్తూంటే, ఆలోచనలు వినువీధిలో ఉరకలు వేస్తూంటే ఓ కారు చప్పుడు అతన్ని బాహ్య స్మృతిలోకి లాక్కువచ్చింది.

మెరుపు తీగలాంటి రేఖ కారుదిగి వయ్యారంగా అతనివంక నడిచింది. ఆమెకు తెలుసు—తన ప్రణయమూర్తి, కృష్ణమూర్తి, ఆవేళప్పుడు ఎక్కడుంటాడో. అందుకే వెతుక్కుంటూ వచ్చింది. అతని భావ సమాధికి అంతరాయం కలిగింది. అందమైన పాలరాతి విగ్రహంలా అతని ఎదురుగుండా కూర్చుంది రేఖ. ఎవరో పిల్లలు కట్టుకున్న పిట్టగూడు చెదరగొట్టాడు కృష్ణమూర్తి.

"మూర్తీ!" అని పిలిచింది ప్రేమకు శబ్దరూపమిస్తూ. జవాబుగా అతను నిర్లిప్తంగా నవ్వాడు. ఎప్పటికి మల్లేనే ఆమె ఆశగా చూసింది. విగ్రహాన్ని కొనగోటితో కూల్చివేయగల చూపు.



పండిన కోపం

చిత్రం—సాగి జానకిరామరాజు (తంగేడు)

సభ్యత, సంస్కారంగల స్త్రీ తన భావాలకు అంతకన్నా చక్కని రూపం ఇవ్వగలదు. మూర్తి గ్రహించాడు. కాని చలించలేదు. ఈనాడు కాదు. ఏనాడైనా అంతే.

ఆమెమీద జాలీ, తనమీద కోపమూ కలిగాయి మూర్తికి.

"మూర్తీ! ఇంకా ఇక్కడే కూర్చున్నావా? మరిచిపోలేదుకదా!"

"ఏమిటీ?"

"హయ్యో రాత! అప్పుడే ప్రొఫెసర్ లక్షణాలన్నీ అలవాటు చేసికుంటున్నావు గదూ?"

"ఏమిటో చెప్పు, రేఖా!"

"సినిమా!"

అతను మరిచిపోయాడు నిజంగానే. తన మౌనం ఆమె అంగీకారంగా అర్థం చేసుకుమంటుంది. ఎందుకు తనకీ దౌర్బల్యం? నిష్కర్షగా ఎందుకు చెప్పలేకపోతాడు? ఆమెలో ఏ తప్పూ లేదు.

తన మెత్తని మనసే ఆమెలో కోరికల్ని పెంచింది.

పాపం! అమృతభాండం లాంటి నిశ్చలతను ఎలా కల్లోలితం చేయడం? నిజంలోని చేదును ఆమె కెలా రుచి చూపించడం?

ఓ సిగరెట్టు వెలిగించి దీర్ఘంగా ఆలోచించాడు మూర్తి. ఈ ఆలోచనలు కలవాడికంటే నిజంగా మూర్ఖుడు సంతోషంగా ఉండగలడు. తాను ఆమెలో ఆశలను రగుల్కొల్పితే క్షంతవ్యుడు. అదీ తాను చెప్పలేని, ఆమె గ్రహించలేని బాధ.

ఆమెవంక చూచాడు మూర్తి. ఆమె అందం భాష కందదు. ఒక విధంగా మంజులలో లేని లావణ్యం రేఖలో ఉంది. దాన్ని తాను కేవలం అభినందించి ఆనందించగలడు.

మూర్తి సిగరెట్టు పొగ వదిలాడు. సందేహం లేదు. రేఖను పెళ్ళి చేసికున్న యువకుడు స్వర్గసౌఖ్యా న్ననుభవిస్తాడు. సౌఖ్యానికి నిర్వచనమూ, ఆనందానికి పరమావధీ తెలిస్తే తానూ, రేఖా కలిసి ఇవాళ సినిమాకు వెళ్ళాలి. కానీ, తన హృదయం కుంచించుకుపోతున్నది. చుట్టూ గిరి గీసుకుంది.

రేఖ అమాయికంగా నవ్వింది, మూర్తి కళ్ళల్లోకి చూస్తూ. అభ్యంతరంగా సిగరెట్టు పొగతో ఇద్దరి మధ్యగల శూన్యంలో తెరవేశాడు మూర్తి. ఆమెమీది సానుభూతిని భరించలేక తల పక్కకు తిప్పుకున్నాడు.

"అరె! ఫైవ్ థర్టీ! మూర్తీ, హరీయప్!"

తాను జవాబు చెప్పలేదు. ఈ అసమర్థతను ఎప్పుడూ పాజిటివ్ కోణంలోనుంచి చూస్తుంది రేఖ.

'నేను రాలేను, రేఖా' అనడంకంటే ఆమెను ఓ కత్తితో పొడిచి చంపితే ఆమె హాయిగా ప్రాణం వదలగలదు. ఎన్నడైనా అలా అనక తప్పదు. తన జీవితంలో ఒక్కసారి మొహమాటాన్ని మరిచి

ఆ మాట అనేశాడు.

రేఖలో ఉప్పెనలా ముంచుకువచ్చింది దుఃఖం. అయినా నిబ్బరంగా తన హృదయాన్ని విప్పి అతనిముందు పెట్టింది.

ఆమె తనను ప్రేమిస్తున్నది అందుకే...

*　　*　　*　　*

ఆ సాయంకాలం—

ఓ వంక చంద్రోదయం. ఓ వంక సూర్యాస్తమయం. రెంటికీమధ్య అనంతమైన ఆకాశం ఓ కళాఖండంలా చెప్పలేనన్ని వర్ణాలతో ప్రకాశిస్తున్నది. రేఖ ఒంటి కాంతిలా, ప్రకృతి ఎరుపో, పసుపో నిర్ణయించరాని రంగును పులుముకుంది.

డాబా పిట్టగోడమీద మోచేతులానించి చెక్కిళ్ళను అరచేతుల్లో దాచుకుని, నెన్నొసట దోబూచులాడే నీలాలకాల్ని నునువేళ్ళతో సవరించుకుంటూంది రేఖ. ఆమెలో పరువులు తీసే భావాలను ఎవరైనా ఓ మహాకవి చూడగలిగితే మహా కావ్యాన్ని సృష్టిస్తాడు. ఉన్నతమైన వక్షం ఉచ్ఛ్వాస నిశ్వాసాల బరువుతో ఊగిపడుతున్నది.

కృష్ణమూర్తిని తలుచుకుంటేచాలు. ఆమెలో వేయి వేణువులు కలిసి మధురసంగీతాన్ని ధ్వనింపజేస్తాయి. ఎందుకో? కారణం చెప్పమంటే ఆమె ఊహకందదు.

ఈ విశాల ప్రపంచంలో ఎందరు అందగాళ్ళు? ఎందరు కోటీశ్వరులు? ఎందరు సహృదయులు? కాని...

గుంపులు గుంపులుగా పక్షు లెగిరిపోతున్నాయి.

రేఖ అర్ధనిమీలితంగా వాటివంక చూస్తున్నది.

ఆమాటకు వస్తే మధుమూర్తికేం తక్కువ? యువతులను పులకరింపజేసే రూపం, రాజ్యాలేలగల సంపద, దానికి తగ్గ ధీరోదాత్తత.

సృష్టిలో అన్నిటికంటే విచిత్రమైన వస్తువేది? అని ఎవరేనా ప్రశ్నిస్తే నిస్సంకోచంగా జవాబు చెబుతుంది రేఖ—'హృదయం' అని. మధుమూర్తికి ఈ సిద్ధాంతం మాత్రం అర్థం కాలేదు. కాదు కూడానేమో! అది అతని పి. హెచ్. డి. జ్ఞానంకన్నా అతీతమైంది.

'జీవితం నీదైనప్పుడు ఆనందంగా ఉండు; మృత్యువునుంచి ఎవరూ తప్పించుకోలేరు' అని ఓ ఇంగ్లీషు కవి చెప్పిన వాక్యాలను తనమేరకు సవరించుకున్నాడు మధుమూర్తి—'రేఖ నీదైనప్పుడు.....' అని. అతని దృష్టిలో జీవితమంటే రేఖ!

పశువులు తమ బసలకు చేరుకుంటున్నాయి.

వాటి బ్రతుకెంత హాయి! అనుకుంది రేఖ. ఆశలూ, ఆదర్శాలూ, అభిరుచులూ మనిషి చుట్టూ పాతుకుపోయిన కటకటాలు. వాటినుంచి తప్పించుకున్ననాడు అతడు విముక్తుడు. అడుగుల సవ్వడి విని వెనుదిరిగి చూచింది రేఖ—మధుమూర్తి! చిరునవ్వు చిందిస్తూ, ఠీవిగా నడిచివచ్చి సోఫా నలంకరించాడు. రావడంలో అతని తప్పేమీలేదు. ప్రతి వ్యక్తీ తన పరిధుల్లోనే ఆలోచించకుండా ఎదుటి వ్యక్తి దృష్ట్యా ఆలోచించడం నేర్చుకుంటే ప్రపంచంలో ఇన్ని సమస్య లుండేవి కావేమో! ఆత్మలకు కళ్ళున్నా, కళ్ళకు మనసున్నా ఎంత బావుణ్ణు! అలా ఉంటే మధుమూర్తి ఇలా వచ్చేవాడా?

కోటుకు అమర్చబడ్డ గులాబీని ఊడదీసి అలవోకగా వాసన చూస్తూ అన్నాడు—"రేఖా! రేపే ప్రయాణం"—అని.

ఎక్కడికీ, ఎందుకూ, ఎవరూ అని ప్రశ్నల పరంపర కురిపించి, కుతూహలపడాలని అతని ఆశయం. ఈ చిన్న విషయంలో అతన్ని నిరుత్సాహపరచడం ఆమె కిష్టంలేదు. అడిగింది.

"చెప్పుకో చూద్దాం."

ఇలా మాటల్ని పెంచడం ఉత్సాహంగల వాళ్ళ లక్షణం. జవాబు చెప్పకుండా "రంగయ్యా! కాఫీ తీసుకురా" అంటూ కేక వేసింది. మనసుకు ఏ విషయాన్నైనా ఊహించే స్వాతంత్ర్యముంది. కాని బహిర్గతంచేసే అధికార మెక్కడిది? 'నీవూ, నేనూ కలిసి, మనం' అని సమాధానం చెప్పి కిసుక్కున నవ్వి చిరుసిగ్గుతో అతనివంక చూస్తే అత నెంత సంతోషిస్తాడో తనకు తెలుసు. కాని.... ఈ కాని అనే శబ్దం భాషలో ఎంత సందిగ్ధాన్ని సృష్టిస్తూంటుందో కదా! 'చెప్పుకో చూద్దాం'కు జవాబు చెప్పవలసిన బాధ్యత తనమీా దుంది. ఆమెలోని సహన శక్తీ, మొహమాటమూ కలిసి మధుమూర్తిలాంటి యువకుడు ప్రయాణం చేయదగిన ప్రదేశం కోసం గాలించాయి.

"హంపీ!" అంది చివరికి.

"కాదు—కాశ్మీర్‌కి" అన్నాడు ఆమె ఓటమిని ఎత్తిచూపుతూ.

కూరడాలకీ, తీరడాలకీ మధ్య ఎన్ని తరాలనుంచి వస్తున్నదో ఈ శత్రుత్వం? పేదవాళ్ళు దురభిప్రాయపడతారు— 'ధనవంతులకు తీరని కోరికలంటూ వుండ'వని. అదెంత పొరపాటో రేఖ చక్కగా నిరూపిస్తుంది.


'క్షమించు, మధూ! నేను రాలేను' అంటే అత నెంత బాధపడతాడు! ఎంత కుమిలిపోతాడు! కాని నిస్సహాయంగా అలా అనాలి. అనక తప్పదు. అందుకే అనేసింది కూడా.

ఆడవాళ్ళకు ఎన్ని బాధలు వచ్చినా కన్నీటితో వాటినుంచి విముక్తిని సాధిస్తారు. కాని, మధుమూర్తి దురదృష్టవంతుడు. మనసారా ఏడుద్దామనుకున్నాడు. సాధ్యంకాక ఆ పనిని మనసు కప్పగించాడు.

అత నెదురుగుండా ఉన్న రేఖ ఎంత బావుందో అతని మదుటనున్న రేఖ అంత చెడుగా ఉంది.

•　　•　　•

మంజుల గాఢంగా నిద్రపోతున్నది.
బయట వెన్నెల కాస్తూనే ఉంది.
తలుపు కిర్రుమని చప్పుడైంది.



ఆక్టర్ లానీ మాన్యుమెంట్
(కలకత్తా)
ఫోటో—జి. వి. నాగేశ్వరరావు (కలకత్తా-43)

బెడ్‌లైటు వెలుగుతూనే ఉంది.

ఈ నిర్భాగ్యుల కథంతా తనకు తెలుసు. అయినా సత్యమూర్తి తన హృదయాన్ని చదవగలడు. ఆ నమ్మకం తనకుంది.

కాని, కృష్ణమూర్తి?

మధును కాదన్న రేఖ, రేఖను ధిక్కరించిన కృష్ణమూర్తి—అంటే అతనికి ఇద్దరి వ్యక్తుల విలువచేసే డిమాండుంది. రక్త బాంధవ్యాన్నలా ఉంచి, అతనిపై తనకో అభిమానమూ ఉంది. అలాటి కృష్ణమూర్తికీ, బికారి సత్యమూర్తికీ ఎక్కడి సామ్యం? సంస్కృతం చెప్పడానికి సత్యమూర్తి వస్తాడో, సత్యమూర్తి కోసమే తాను సంస్కృతం చదువుకుంటున్నదో తనకు తెలీదు.

పక్షులు రెక్కలు విదిలించాయి.

ఈ సృష్టివైచిత్రిని తా నెలా అర్థం చేసుకుంటుంది? మానవజాతి అంతా ఒకటే. కాని మనిషికీ, మనిషికీ మధ్య ఎంత భిన్నత? తనను భార్యగా ఆరాధించే ఏ మూర్తయితే తన కేమిటి? కాని తా నంగీకరిస్తుందా?

పెళ్ళి అనేది సాంఘిక బంధం. సత్యమూర్తి మానసిక బంధం. సమాజం తనకు కృష్ణమూర్తిని 'ఆఫర్' చేస్తున్నది, తన కొక మనసూ, ప్రత్యేక వ్యక్తిత్వమూ ఉన్నా. తాను సంఘంలో నివసిస్తున్నది. తాను ఎంత సంఘంలో నివసించినా, తనకు ప్రత్యేకమైన అభిరుచులున్నాయి. దేనికి ప్రాధాన్యం? ఈ మూర్తిద్వయం ఘర్షణపడడానికి తన హృదయం ఓ రణరంగంగా మారిపోయిందేం?

గుండెబలం పుంజుకుని కచ్చితంగా ఓ నిర్ణయానికి రాక తప్పదు. దేవుడు సుఖ దుఃఖాల్లో ఓ సమానత్వాన్ని నెలకొల్పాడు. ఆ పద్ధతిని ఒకడు దుఃఖిస్తేనే ఇంకొకడికి సుఖం దక్కుతుంది. అబ్బ! ప్రేమ అనే పదార్థంలో ఇంత



నిరీక్షణ

చిత్రం-వీరశెట్టి అచ్యుతరావు (పుల్లేటికుర్రు)

# చంక్రమణం

సంకుచితత్వమూ, స్వార్థపరత్వమూ ఉన్నాయన్నమాట. మరి అంతకంటే ఉత్కృష్టమైంది లేదని చెబుతారే!

గాలిలో చల్లదనం హెచ్చింది.

మంజుల గాఢంగా నిద్రిస్తున్నది.

పక్షులు రెక్కలు విదిలించడం మానుకున్నాయి.

వెన్నెల ప్రసరిస్తూనే ఉంది.

తలుపు రెక్క కిర్రుమని చప్పుడైంది.

'టక్'మని బెడ్‌లైటు ఆరిపోయింది.

'ఖంగు'న మంచినీళ్ళ గ్లాసు కిందపడింది.

మంజుల కళ్ళు తెరిచింది.

చీకటి!

కళ్ళు నులుముకుంది.

టేబుల్ మీది పుస్తకాలు ధడేల్‌మని క్రింద పడ్డాయి.

కిటికీగుండా ప్రసరిస్తున్న వెన్నెల నలుపెక్కింది.

ఆ నలుపును తేరిపార చూసింది మంజుల.

ఓ 'మనిషి'గా పోల్చుకుంది.

ఆమె గుండె జల్లుమంది.

కేక వేయబోయింది. గుండె పెగల్లేదు.

ధైర్యాన్ని పుంజుకుని నిశ్శబ్దంగా లేచింది.

లైట్ స్విచ్ వేసింది.

ఆ మనిషి చేతిలో నగల పెట్టె!

అతను సత్యమూర్తి!!

అదే గంభీరమైన రూపం, సంస్కారం ఉట్టిపడే చూపు. తనకళ్ళను తానే నమ్మలేకపోయింది, మంజుల. ఆశ్చర్యమూ, కోపమూ, దుఃఖమూ, అవమానమూ, ఉక్రోషమూ అన్నీ కలిసి ఆమెలో సుళ్ళు తిరగడం ప్రారంభించాయి. ఒక క్షణం సేపు కళ్ళు చూచే జ్ఞానాన్నీ, మెదడు ఆలోచించే శక్తినీ కోల్పోయాయి.

'సత్యమూర్తీ!' అనబోయింది.

'ఛీ!' అని ఆమె హృదయం మూగగా ధ్వనించింది. న్యాయస్థానం ముందు అపరాధిలా తల వంచుకుని నించున్నాడు సత్యమూర్తి. ఆమెలో అగ్నిపర్వతంలా ఉబికింది దుఃఖం.

"ఏ..మి...టి... ది ....మే...స్టా...రూ...?" ఒక్కొక్క అక్షరమూ పాతాళంనుంచి పెకలిస్తున్నట్టుగా, గుండె పగిలేలా, గద్గదంగా అనేసింది.

"నన్ను పరీక్షించడానికి వచ్చారా?"

సత్యమూర్తి దీనంగా చూచాడు.

"ఈ దోషిని క్షమించండి, మంజులాదేవీ!" గంభీరంగా అన్నాడు.

ఎంత సులువు, క్షమించమనడం!

అందరిలా తానూ పుట్టాడు. కాని అందరిలా జీవించే భాగ్యం తన కెందు కుండగూడదు? అందరిలా సుఖపడే హక్కు తన కెందుకు లేదు?

మంజుల కోపం పట్టలేకపోయింది. "ఇంత నీచానికి దిగజారతా రనుకోలేదు మేస్టారూ?" అన్నది బాధగా.

"నాకు దొంగతనం చేయడమే ధ్యేయం కాదు, మంజులగారూ. జరిగేదీ, జరిగిందీ, జరగాల్సిందీ విధి రాసిన పుస్తకంలోని సిద్ధాంతాలు. వాటిల్లో ఇదో అచ్చుతప్పు. దానికి నా బాధ్యత ఏమీలేదు. అయినా నన్ను క్షమించండి."

"మీకు కావాలంటే ఈ నగలే కాదు, నా సర్వస్వాన్నీ అర్పించేద్దునుగా?"

"అడగడానికి స్వాభిమానం అడ్డొస్తుందని మీకు తెలీదు."

"ఐతే ఈ గౌరవప్రదమైన దొంగతనాన్నే ఎన్నుకున్నా రన్నమాట."

"నన్నుమాటలతో ఖూనీ చేయకండి,మంజులాదేవీ! నగలు దక్కడం, లేదా జెయిలుకి వెళ్ళడం. ఈ రెండు ప్రయోజనాల్లో ఏ ఒక్కటి సఫలమైనా నేను ధన్యుణ్ణే."

"రెండూ కాకపోతే?"

"మిగిలేది నిరాశ."

"అంటే?"

"మీదగ్గర దాపరిక మెందుకు?" అంటూ కిటికీగుండా అవలికి చూస్తూ చెప్పడం సాగించాడు సత్యమూర్తి.

"ఆమెని — అంటే మాధురిని—ప్రాణప్రదంగా ప్రేమించాను. ఎన్నో కలలు కన్నాను. కాని ఆమె మీలాగా కలవారి బిడ్డ, మంజులాదేవి. డబ్బులేదనీ, నేనో బికారిననీ కసిరికొట్టింది."

ఆ మాటల్లోని ప్రతి అక్షరమూ బల్లెమై ఆమెను చీల్చివేస్తున్నాయి. మనసువడ్డ మగవాడు దొంగైనా ఆడది క్షమించగలదు. కాని...

"అంతకంటే ఏం చేయను? ఆమెకోసం ధనవంతుణ్ణి కావాలని ఓ రిత్త కోరిక కోరాను. ఆమెకోసం, ఎలాటి కష్టాన్నైనా, ఆనందంగా, సహృదయుంగా స్వీకరించడానికే నేను బ్రతుకుతాను."

మంజులలో చైతన్యం నశించిపోయింది.

"ఆమె నాకు దక్కుతుం దంటారా, మంజులగారూ?" బాధగా పెకలించా డా మాటలను గుండె లోతుల్లోంచి.

చెట్టుమీది పక్షి రెక్కలు విదిలిస్తూ మరో చెట్టుమీదకు ఎగిరిపోయింది.

రివ్వున గాలి వీచింది.

వెన్నెల ప్రసరిస్తూనే ఉంది.

లైటు వెలుగుతున్నది.

మంజుల నిద్రలాంటి మెలకువలో పీడకల కంటూంది.

ఈ కథ ఎలా అంతమవ్వాలి!!

మాధురి, మధుమూర్తిని ప్రేమిస్తేగాని ఈ కథకు విముక్తి లేదేమో!

★